గోర్కీ పాత్ర



"గోర్కీ కథ ఒకటి ట్రాన్స్‌లేట్ చేసి పెట్టవా? ఈ రాత్రికెటూ కేసులు వచ్చేలా లేవు. మా స్త్రీ శక్తి సంఘటన తరపున సావనీరు రిలీజ్ చేస్తున్నాం. ఈ కథ అందులో వుండి తీరాలి. ప్లీజ్! కాదనవద్దు.

రెండు కప్పుల టీ,'నీ ఏకాంత నిశ్శబ్ద విషాదాన్ని డిస్టర్బ్ చెయ్యననే హామీ, అఫ్‌కోర్స్ కృతజ్ఞతా పూర్వకంగా సావనీరు కాపీ నీకు రెమ్యునరేషన్‌గా ఇస్తాను" లేబరు వార్డులో, హౌస్ సర్జన్స్ డ్యూటీ రూమ్‌లో పరిసరాల్ని పట్టించుకోని ఎస్కేప్‌లో వున్న నాపై దాడి చేసినట్లుగా, గోర్కీ కథల సంపుటం, నోట్ బుక్, పెన్‌తో సహా అభ్యర్థనా పూర్వకమైన కమాండ్‌తో సరళ ప్రత్యక్షమైంది. సరళ నాతోటి హౌస్‌సర్జన్. ఇప్పటివరకు నర్సింగ్ స్టూడెంట్లకు 'దాస్ కేపిటల్'లోని ముఖ్యాంశాలపై రెండు గంటల లెక్చరు యిచ్చింది. ఇప్పుడు నాపై దాడి. సరళను చూస్తే నాకు ఆశ్చర్యం వేస్తుంది. ఇరవై యేళ్ళయినా దాటని ఈ యువతిలో ఎంత పరిణతి. ఎంత హుందాతనం! సాధారణంగా ఆ వయసు అమ్మాయిలు మధురమైన ఊహల్తో, ఒక అసహజమైన అమాయకమైన వాతావరణంలో జీవిస్తూ వుంటారు. కానీ ఈ సరళ ఇంత చిన్న వయసులోనే వర్గ రాహిత్య సమాజం గురించి కలలు కంటూంది. కొంతమంది కాలేజీ యువతులతో కలిసి 'స్త్రీ శక్తి సంఘటన' అనే సంస్థను ఏర్పాటు చేసింది. స్త్రీ సమస్యలపై కరపత్రాలు, పుస్తకాలు ప్రచురించడం, ముఖ్యమైన సమస్యలపై ఊరేగింపులు, ధర్నాలు చెయ్యడంతో ఎప్పుడూ బిజీగా వుంటుంది. ఎస్కేపిస్టునని నాకు లేబుల్ వేస్తుంది. నా కథలు కాలక్షేపం బఠాణీలని వెక్కిరిస్తుంది.

అయినా సరళంటే నాకు ప్రాణం. నాకున్న ఒకే ఒక ఆంతరంగిక నేస్తం సరళ. ఇద్దరం సాయంకాలాల్ని, జీవితపు వ్యధని, దాని అంతుపట్టనితనాన్ని పంచుకుంటూ వుంటాము. తన సావనీరులోని కథ కోసం ప్రత్యేకంగా నన్ను ఎన్నుకోవడం గొప్ప థ్రిల్ కలిగించింది.

రాత్రి ఎనిమిది గంటల వేళ ఒక డెలివరీ అయింది. అప్పటి నుంచి ఖాళీ. డ్యూటీ గైనకాలజిస్టు డాక్టర్ వసుంధర "కేసులు లేకపోతే విసుగేస్తుందర్రా! అలా తిరిగొస్తాను" అంటూ పక్కవార్డులకు వెళ్ళింది. డ్యూటీ పి.జి.డాక్టర్ రాధ, సర్జరీ పి.జి.తోటి 'ఉమ్రావ్ జాన్' సెకండ్ షోకి వెళ్ళింది. స్టాఫ్ నర్సులిద్దరూ, మందలోని తెల్లమేకల్లా పోలికలు గుర్తుపట్టలేని స్టూడెంటు నర్సులను ముందు కూర్చోబెట్టుకొని, జ్ఞాపకాల వాకిళ్ళను తెరచి ఎప్పటివో కబుర్లు కుప్పలు పోస్తున్నారు.

గోర్కీ కథల పుస్తకాన్ని చేతుల్లోకి తీసుకోగానే ఎందుకో ఒళ్ళు జలదరించింది. జలపాతంలా దూకే సాహితీ అనుభూతిని దోసిళ్ళలో పట్టే ప్రయత్నం చేస్తున్నాను. స్తబ్దమైన రాత్రి. క్షణం పాటు విశ్రమించిన సముద్రంలా నిద్రిస్తున్న హాస్పిటల్. పసిపిల్లలు నిద్రలో ఉలిక్కిపడి లేచి ఏడ్చే ఏడుపు మినహా మానవ అస్థిత్వాన్ని తెలిపే జాడలేమీ లేని రాత్రి. నా కలం కదలనని మొరాయించింది. నోట్ బుక్‌లోని కాగితాలు ఎనీమియా పేషంటులా తెల్లగా, నీరసంగా రెపరెప లాడుతున్నాయి. అనువాదం చెయ్యాల్సిన కథపేరు 'ఏ మాన్ ఈజ్ బోర్న్'. అరణ్య మధ్యంలో ఒంటరిగా పొదలమాటున పురిటి నొప్పులు పడుతున్న మాతృమూర్తికి కాన్పులో సాయం చేసిన బాటసారి కథ అది. బాటసారికి కాన్పు గురించి తెలియదు. తెలిసిన కొద్దిపాటి పరిజ్ఞానంతో ఆమెకు సాయం చేస్తాడు. ఆ తల్లికి సిగ్గు, కోపం, కానీ తప్పనిసరి పరిస్థితి. ఇద్దరి మధ్య గంభీరమైన స్నేహభావం నెలకొంటుంది. సాటిమనిషి కష్టానికి బాటసారి స్పందించిన తీరు విస్మయాన్ని కలిగిస్తుంది. బయటికి వస్తున్న శిశువు తలను రెండు చేతులతో పట్టుకొని భద్రంగా బయటకు తీయడం, పక్కనున్న సముద్రంలో స్నానం చేయించడం, 'మాయ'ను నేలలో పూడ్చి పెట్టడం, బాటసారి నిజమైన మానవతామూర్తిగా దర్శనమిస్తాడు. కాన్పు తరువాత నీరసంగా వున్న తల్లికి 'టీ' చేసి పెట్టి, ఆమెను అనునయించి, శిశువును లాలించి, వాడి చిరునవ్వుల్లో ప్రాచీన స్మృతుల చప్పుళ్ళను వినగలిగి, 'ఏ మాన్ ఈజ్ బోర్న్' అని గర్వపడి గృహోన్ముఖుడయ్యే బాటసారి పాత్ర సాధారణమైన వ్యక్తుల్లోని అసాధారణ మైన లక్షణాల్ని చూపిస్తుంది. ఎనిమిది పేజీల సరిహద్దుల మధ్య కరుణ సాంద్రమైన జీవితాన్ని సృష్టించాడు గోర్కీ. మనుషుల్లోని మంచితనాన్ని నిరూపించడం, దాన్ని హైలైట్ చెయ్యడం ఎంతో యిష్టం గోర్కీకి. ఈ కథను అనువాదం చెయ్యడానికి ఇంగ్లీషు, తెలుగు రావటం మాత్రమే చాలదు. మానవతా భాష కూడా తెలిసి వుండాలి.

బయట వార్డులో గొడవకు నా ఆలోచనల సరస్సు చెదిరింది. స్టాఫ్ నర్సు పెద్దగా అరుచుకుంటూ వస్తోంది. "హౌస్ సర్జన్ బాబు! కొంప మునిగింది. తాడికొండ నుంచి పేషెంటు వచ్చింది. ప్రైమీ. ఫీటస్ పెల్విస్ దగ్గర అబ్‌స్ట్రక్ట్ అయింది. వెంటనే ఆపరేషన్ చెయ్యాలి. వసుంధరమ్మగారు డ్యూటీ రూమ్‌లో లేరు. ఇంటిదగ్గర లేరు. ఏ వార్డులో

అడిగినా మాకు తెలియదంటున్నారు. పి.జి. డాక్టరమ్మ ఫ్రెండుతోటి సినిమాకు వెళ్ళిందట. అదేదో సినిమా పేరు చెప్పింది. అక్కడికి వార్డు బాయ్‌ని పంపాను. లేదంట. ఏం చెయ్యాలో చేతులాట్టం లేదు. ఏమాత్రం ఆలస్యమైనా తల్లీ బిడ్డల ప్రాణాలకే ముప్పు" నర్సు కేకలు వేస్తూంది. బయట దిగులు ముఖంతో సరళ. "ఏం చెయ్యాలో పాలుపోవడం లేదు. వసుంధరా మేడమ్ ఎక్కడి కెళ్ళారో తెలియదు. రాధగారు కూడా లేదు. పేషెంటు పరిస్థితి క్రిటికల్‌గా వుంది. వెంటనే ఆపరేషన్ చెయ్యాలి. ఫీటల్ డిస్ట్రెస్ కూడా వచ్చింది. మనం చూస్తే ఇంకా స్టూడెంట్సుమే. ఇంకా స్కాల్‌పెల్ కూడా పట్టుకోలేదు. కళ్ళముందు ఒక పేషెంటు అలా ప్రాణాలు పోగొట్టుకుంటుంటే గుండె కత్తితో కోసినట్టుంది" సరళ రెస్ట్‌లెస్‌గా వుంది.

ఇలాంటి విషాదాలు ఈ హాస్పటల్‌లో మామూలే అయినా కళ్ళముందు జరుగుతుంటే చెప్పలేనంత గిల్టీగా వుంది. రెండు మూడు నిముషాల విచారం తరువాత నాలో ఒక తెగింపు కలిగింది. ఇప్పుడే చదివిన గోర్కీ కథ గుర్తుకొచ్చింది. బాటసారి ఆ తల్లికి చేసిన సాయం గుర్తుకొచ్చింది. నిస్సహాయ స్థితిలో బాటసారి కాన్పుచేసే మంత్రసాని అయ్యాడు. గోర్కీ కథ సందేశం యిచ్చింది. నేను ఆపరేషన్ చెయ్యడానికి నిర్ణయించుకొన్నాను.

"సిస్టర్! పేషంటును థియేటరుకు తీసుకురండి. ఆపరేషన్ నేను చేస్తాను. వందల కేసుల్లో మేడమ్ పక్కన వుండి అబ్‌జర్వ్ చేశాను. ఈ పరిస్థితుల్లో ఇంతకన్నా గత్యంతరం లేదు. ఏం జరిగినా ఐ విల్ టేక్ ది రెస్పాన్సిబులిటీ, మీరు పదండి. ఎనస్థటిస్ట్‌కు ఫోన్ చెయ్యండి." స్టాఫ్ నర్సు నావైపు వింతగా చూసింది సరిగ్గా గ్లవ్స్ వేసుకోవడం రాని ఈ కుర్రాడు ఆపరేషన్ చేయడమా? అన్నట్టుగా. కానీ ఆ పరిస్థితిలో అంతకన్నా వేరే మార్గం లేదని గ్రహించి వార్డులోకి వెళ్ళింది పేషంటును ప్రిపేరు చేసేందుకు. 'రాజా! ఏమిటీ సాహసం? పేషెంటుకేమన్నా అయితే?" సందేహంతో నావైపు చూస్తూ అడిగింది సరళ. "చుట్టూ చీకటి వుందని విసుక్కునే కన్నా తెగించి ఒక దీపం వెలిగించడం గొప్పని నువ్వే చెబుతుంటావుగా" అంటూ థియేటర్ వైపు నడిచాను.

ఆపరేషన్ థియేటర్‌లోకి అడుగుపెట్టిన తరువాత నాలో చిత్రమైన మార్పు వచ్చింది. అది వార్డు కానీ, క్లాస్ రూమ్‌కానీ హఠాత్తుగా ఒక కవితావేశం ప్రతీకార జ్వాలలా మనసుపై దాడి చేసి నన్ను ఒక ట్రాన్స్‌లోకి విసిరివేస్తుండేది. ఆ క్షణం మనసులో కవితావేణువుల సవ్వడి లేదు. అన్ని అనుభూతుల్నీ మరచిపోయి క్రమశిక్షణగల సైనికుడిలా మారాను.

చేతులు వాష్ చేసుకొని, గ్లవ్స్ వేసుకుని ఆపరేషన్ టేబుల్ వైపు కదిలాను. ఎనస్థటిస్ట్ అప్పటికే వచ్చి వున్నాడు. అనుభూతుల లోకాల కందని స్పర్శారాహిత్యంలో వుంది పేషెంటు. "పేషెంటు తాలూకు బంధువులు విసిగిస్తున్నారు. సరళగారిని ఒకసారి బయటకు రమ్మని చెప్పండి." హడావుడిగా వచ్చింది స్టూడెంటు నర్సు. "ఆపరేషనుకు ముందు పేషెంటు భర్త అవసరమైన రక్తాన్ని ఇస్తానని చెప్పి, తీరా యిప్పుడు డబ్బులిస్తాం ఎక్కడైనా కొనుక్కురండి అంటున్నాడు. డబ్బు పెడితే వచ్చేదా రక్తం. అదీ బి.పాజిటివ్

బ్లడ్..." నర్సు గొణుగుతూంది. "వెళ్ళి ఆ సంగతి చూసి వస్తాను" అంటూ ప్రేమగా భుజం తట్టి బయటకు వెళ్ళింది సరళ.

పొత్తి కడుపుపైన, బొడ్డు కింద సన్నని ఇన్‌సెషన్ ఇచ్చాను. ఎందుకో చేతులు వణికాయి. కొన్ని వందల సార్లు చూసి వుంటాను ఈ ఆపరేషను. అయినా చెప్పలేని భయం ఒళ్ళంతా పాకింది. చెమట ధారల మధ్య నా ఒళ్ళు వర్షిస్తున్న ఆకాశంలా వుంది.

చర్మం క్రింది లేయర్సుని వేరుచేసి, రక్తం ఆపడానికి పాడ్స్ పెట్టుకుని, లిగమెంట్సు ఆధారంగా యుటెరస్‌ని గుర్తుపట్టాను. లోపలి శిశువు శరీర భాగాల్ని నిర్ధారణ చేసుకొని యుటెరస్‌కు ఇన్‌సిషన్ ఇచ్చాను. ఉమ్మ్మనీరును చీల్చి చూపుడు వేలు సాయంతో శిశువు భుజాన్ని నొక్కి పట్టి మెల్లగా శిశువును బయటకు తీశాను. మగశిశువు. కార్డుకు క్లాంప్ వేసి నర్సుకిచ్చాను. నర్సు పిల్లవాడి నోరు, ముక్కులు సక్ చేస్తోంది. నాలోని భయం, వణుకు ఎప్పుడు నా నుంచి దూరం అయ్యాయో తెలియదు. సూటిగా గమ్యం వైపు సాగే నావికుడిలా సాగిపోతున్నాను. తెగిన రక్తనాళాల్ని ఎప్పటికప్పుడు లిగేట్ చేసుకుంటూ, ప్లాసెంటాను బయటకు లాగివేసి మెల్లిగా సూచర్సు వేయడం మొదలు పెట్టాను. సూచర్సు పూర్తిచేసి గట్టిగా నిట్టూరుస్తున్నంతలో, వెనుకనుంచి రెండు మెత్తటి చేతులు నా భుజంపై పడ్డాయి. సుకుమారమైన పెదవులు నా బుగ్గల్ని ముద్దాడాయి. సరళ కాబోలు అనుకుంటూ తిరిగి చూస్తే వసుంధరా మేడమ్.

"ఐయామ్ ప్రౌడ్ ఆఫ్ యు మై బాయ్! ఎన్నో యేళ్ళ అనుభవమున్న డాక్టర్‌లా చేశావు ఆపరేషను. కీప్ ఇట్ అప్! నువ్వు యుటెరస్ ఓపెన్ చేస్తున్నప్పుడే వచ్చాను. నిన్ను డిస్టర్బ్ చెయ్యడం ఇష్టంలేక వెనక నుంచున్నాను. అండ్ థాంక్స్ ఫర్ సేవింగ్ మి ఇన్ ది క్రైసిస్. పేషెంటు కేమన్నా అయితే హాస్పిటల్ పరువు బజార్న పడేది. నువ్వు చేసిన సాహసం ఎంతో థ్రిల్లింగ్‌గా వుంది. చాలా రోజుల పాటు గుర్తుంచుకొంటానీ సంఘటనని" అంటూ మేడమ్ కాంప్లిమెంటు చేసింది. భాష వ్యక్తం చెయ్యలేనంత ఆనందంతో బయటకు వస్తుంటే అక్కడ సరళ జాడలేదు. ఆ క్షణం తను అక్కడ లేకపోవడం– నన్ను ప్రశంసించకపోవటం, దిగులు అనిపించింది.

ఉద్వేగంతో డ్యూటీ రూమ్‌వైపు వెళ్ళాను. రూమ్‌లో మంచంపై పడుకుని వుంది సరళ. "కంగ్రాట్స్! సిస్టర్ యిప్పుడే చెప్పింది ఆపరేషన్ సక్సెస్ అని. బాగా నీరసంగా వుండి నీకు కంపెనీ యివ్వలేకపోయాను. పేషెంటు తాలూకు బంధువులు రక్తం యివ్వమని మొరాయించారు. ఈ ఆపరేషనుకు బ్లడ్ ఎంత అవసరమో నాకు తెలుసు. నాది బి.పాజిటివ్ కదా..." సరళ నవ్వుతూ చెబుతున్నా నా కళ్ళలో నీళ్ళు. ఎంత త్యాగం! గోర్కీ కథ చదివినప్పుడు ఆ కథలోని పాత్రల మంచితనం, త్యాగ నిరతి నన్ను విస్మయ పరిచాయి. అలాంటి వ్యక్తులు కొద్దిమందైనా మన మధ్య వుండబట్టే ఇంత కుళ్ళు, ఇంత దుర్మార్గం, ఇంతమోసం వున్న ఈ ప్రపంచంలో మనం ఈ మాత్రంగానైనా బ్రతకగలుగుతున్నామనిపించింది. సరళ సజీవంగా మన మధ్య జీవిస్తున్న గోర్కీపాత్ర.

• ఆంధ్రజ్యోతి వారపత్రిక, 5 ఏప్రిల్ 1991 •